క్లుప్తంగా

టీటీడీ చైర్మన్ భూమనకు శుభాకాంక్షలు



భూమన కరుణాకర రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: టీటీడీ చైర్మన్‌గా నియమితులైన భూమన కరుణాకర రెడ్డికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతిలోని భూమన ఇంటికి చేరుకున్న ఆదిమూలం శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వరాలయ ప్రత్యేక ఆహ్వానితులు రాధాకృష్ణారెడ్డి, పిచ్చాటూరు మండల వైఎస్సార్‌సీపీ నేత మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నారాయణవనం: మండలకేంద్రంలోని స్థానిక సొరకాయల స్వామి ఆలయ కల్యాణ మండపంలో జరిగే నేతన్న నేస్తం 5వ విడత పంపిణీ కార్యక్రమంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని ఎంపీడీఓ గుణశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో నేతన్న నేస్తం లబ్ధిదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు గడప గడపకు మనప్రభుత్వం

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం పంచాయతీ పరిధిలో సోమవారం మధ్యాహ్నం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, ఎంపీడీఓ గిడ్డయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొంటారని వివరించారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

శ్రీకాళహస్తి: పట్టణంలోని బాలుర గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో భారత్ సౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్ మాస్టర్లు అజారుద్దీన్, సుబ్రహ్మణ్యం, ధనుష్ పాఠశాల విద్యార్థులకు స్నేహం విలువను వివరించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సంబరాలు

శ్రీకాళహస్తి: ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీకి శిక్ష విధిస్తూ గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో శ్రీకాళహస్తిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ బత్తెయ్యనాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి స్వీట్లుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జానీబాషా, విజయశేఖర్, వెంకటముని, రాఘవరెడ్డి, గోపి, శివయ్య, నాగూరయ్య, రమణయ్య, మోహన్, సురేష్, బాలాజీ, వాణెమ్మ, మస్తానమ్మ, భానమ్మ, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొల్లాపూరమ్మ జాతర



రేణిగుంట: మండల కేంద్రంలోని అన్నెనగర్‌లో వెలసిన కొల్లాపూరమ్మ జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొల్లాపూరమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. గరిక ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా కుంభం వేశారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా విశేషంగా విద్యుత్ దీపాలంకరణ చేయడంతో ఉత్సవ శోభ కనిపించింది.

అపూర్వ కలయిక



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 1989–90 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, ముత్యాల పార్థసారథి, మౌలాలి, మల్లికార్జున్, అహమ్మద్‌బాషా, సురేష్, శంకర్ నారాయణ, జ్యోతిరావు, కృష్ణకుమార్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి
- తొట్టంబేడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం
- గజమాలతో స్వాగతం పలికిన జనం



ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో ఆత్మీయంగా మాట్లాడుతున్న వృద్ధురాలు



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న ప్రజలు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం మండలంలోని తొట్టంబేడు–2 సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే పర్యటించారు. బంగారమ్మకాలనీ, ఈదులగుంట గ్రామంలో ఇంటింటికీ వెళ్లారు. ఆయనకు మహిళలు పెద్ద ఎత్తున మంగళ హారతులు, గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసి, తరువాత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని, ప్రతి కుటుంబానికి నవరత్నాల ద్వారా అన్ని సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. తన కుటుంబం నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తోందని గుర్తుచేశారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందరికీ అందించడం జగనన్న ప్రత్యేకత అని చెప్పారు. గ్రామంలో సమస్య ఏదైనా ఉంటే పార్టీ కార్యాలయానికి నేరుగా రావచ్చని ప్రజలకు సూచించారు. గ్రామంలో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కొంతమంది పింఛన్లు రద్దు చేశారని ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు సక్రమంగా లేవని కొంతమంది తెలపగా వెంటనే వాటిని వేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉన్నం నిర్మల, మండల కన్వీనర్ ఉన్నం వాసునాయుడు, చంద్రయ్యనాయుడు, సుధాకర్ రెడ్డి, జెడ్పీటీసీ అర్చనాదేవి, వైస్ ఎంపీపీ గెరటారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సుబ్బయ్య, నాయకులు మునిరత్నం, మణినాయుడు, రమణారెడ్డి, అలంకార్, మునికృష్ణ, నాయకులు, మండలాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థుల ఎంపిక



సి.శివకేశవ

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని ఆర్‌సీపీ హైస్కూల్ విద్యార్థి సి.శివకేశవ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. దీంతో కరస్పాండెంట్ కాపిరెడ్డి డిల్లీ బాబు రెడ్డి మాట్లాడుతూ ఇటీవల విడుదలైన రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)ఏపీ –2023 ఫలితాల్లో శివకేశవ నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో 573 మార్కులు సాధించాడు. సి.శివకేశవను కరస్పాండెంట్ డిల్లీబాబు రెడ్డి, హెచ్‌ఎం సుప్రజ ఘనంగా సత్కరించారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక



లోకేశ్వరి

నారాయణవనం: ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు తమ పాఠశాల విద్యార్థిని లోకేశ్వరి ఎంపికై నట్లు మండలకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శశికళ ఆదివారం తెలిపారు. ఇదివరకే మండలం నుంచి ఇడుపులపాయ క్యాంపస్‌కు నలుగురు, ఒంగోలు క్యాంపస్‌కు ఒకరు ఎంపికైనట్లు చెప్పారు. ఈసారి బాలికల పాఠశాల నుంచి మేఘల, దీపిక, లోకేశ్వరి ట్రిపుల్ ఐటీలో సీట్లను సాధించారని ఆమె తెలిపారు.

ఘనంగా అక్కమ్మ దేవతకు పూజలు



అక్కమ్మదేవతకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామంలో వెలసిన అక్కమ్మ దేవతకు ఆదివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. అక్కమ్మ అమ్మవారి ప్రతిమను పూలతో అలంకరించారు. కాటూరు దళితవాడకు చెందిన దళితులు అక్కమ్మ దేవతకు పొంగళ్లు పెట్టి, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఏటా జాతర నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

మణిపూర్‌లో క్రైస్తవులకు అండగా నిలుద్దాం



మాట్లాడుతున్న ఫాస్టర్ లూథరన్‌బాబు

రేణిగుంట: మణిపూర్‌లో నానా ఇబ్బందులు పడుతున్న క్రైస్తవులకు దేశ ప్రజానీకమంతా అండగా నిలవాలని రేణిగుంట జీవాగ్రం సెయింట్ లూథరన్ చర్చి ఫాస్టర్ లూథరన్‌బాబు కోరారు. చర్చి ఆవరణలో ఆదివారం ఆయన మాట్లాడుతూ తమ వంతు సహాయంగా జీవాగ్రం సెయింట్ లూథరన్ చర్చి తరపున రూ.లక్షా 35వేలు ఎస్‌ఏఎల్‌సీ సెంట్రల్ చర్చికి అందించామన్నారు. మణిపూర్ అల్లర్లలో క్రైస్తవులను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేయడంతోపాటు ప్రార్థనా మందిరాలపై దాడులు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ ధ్యక్షుడు దివాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

రేణిగుంట: మండలంలోని గురవరాజుపల్లి పంచాయతీ రామకృష్ణాపురానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ (టీడీపీ) దివంగత రాజేంద్ర సతీమణి సాధన ఆదివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. తన భర్త ఎన్నో ఏళ్లుగా టీడీపీకి సేవలందించి, చంద్రబాబు పర్యటనకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే, టీడీపీ నాయకులు కనీసం పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితురాలై వైఎస్సార్ సీపీలో చేరినట్లు ఆమె తెలిపారు. ఆమెకు ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కావళ్లతో ఆలయానికి భక్తులు



తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయానికి కావళ్లతో వెళుతున్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని ఆమందూరు పంచాయతీ పరిధి బాలకృష్ణాపురంలో ఆదివారం భక్తులు కావళ్లతో తిరుత్తణి సుబ్రమణ్య స్వామి ఆలయానికి తరలివెళ్లారు. ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామస్తులు తమ ఇళ్ల వద్ద భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి మూకుమ్మడిగా కావళ్లతో ఊరేగింపుగా వెళ్లారు. ప్రతి ఏడాది గ్రామస్తులు కలిసికట్టుగా తిరుత్తణి సుబ్రమణ్య స్వామి ఆలయానికి వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రజా గాయకుడు గద్దర్ మృతి తీరనిలోటు

శ్రీకాళహస్తి: ప్రజాగాయకుడు గద్దర్ మృతి పీడిత వర్గాల ప్రజలకు తీరనిలోటు అని ప్రజాసంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గద్దల మునెయ్య అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజాగాయకుడు గద్దర్ అలియాస్ గుమ్మడి విఠల్‌రావు 1949లో మెదక్ జిల్లా తుప్రాన్ ప్రాంతంలో జన్మించారన్నారు. నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాల్లో విద్యాభ్యాసం కొనసాగించారన్నారు. అనంతరం 1975లో కెనరాబ్యాంకులో ఉద్యోగిగా చేరారు. అప్పటికే తెలంగాణలో సాయుధ పోరాటం నడుస్తున్న తరుణంలో జననాట్యమండలి వ్యవస్థాపక సభ్యుడిగా విప్లవ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. తనదైన శైలిలో ప్రజల సాధకబాధలను పాట రూపంలో ప్రదర్శించి బడుగు బలహీన వర్గాల్లో స్ఫూర్తి నింపారని చెప్పారు. అలాంటి ప్రజా గాయకులు మరణించడం బాధాకరమన్నారు.

తొట్టంబేడు మండలంలో..

తొట్టంబేడు: గద్దర్ మృతి పీడిత వర్గాలకు తీరని లోటు అని జననాట్యమండలి మాజీ సభ్యులు, ఆయన అభిమానులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గద్దర్ తుదిశ్వాస వరకు పీడిత వర్గాల విముక్తి కోసం పని చేశాడని అందులో పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో గద్దర్‌కు విడదీయరాని బంధం ఉందని చెప్పారు. గద్దర్ మరణం తమను తీవ్ర మనోవేదనకు గురి చేసిందన్నారు. శ్రీరాములు, గంధం కిషోర్, సుదర్శన్, పాదం శివన్న, శంకరరెడ్డి, మదన్, కృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

స్నేహపూర్వకంగా మెలగండి



సమావేశంలో ప్రసంగిస్తున్న యోగా గురువు సురేష్ నాయుడు

వరదయ్యపాళెం: స్నేహపూర్వక వాతావరణంతోనే సమాజ శ్రేయస్సు సాధ్యమని ప్రముఖ యోగా గురువు సహజ సంపద వ్యవస్థాపకుడు సురేష్ నాయుడు అన్నారు. ఆదివారం వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో డైనమిక్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సురేష్ నాయుడు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలన్నారు. అలాంటి వాతావరణమే సన్మార్గంలో నడిచేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఆ దిశగా డైనమిక్ ఫౌండేషన్ సభ్యులు ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందించేలా పలు వినూత్నమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో దేవాంగ సంఘం అధ్యక్షుడు పృథ్వీ రవి, సామాజిక కార్యకర్తలు ఇనుప రాజేంద్రన్, శరవణ, డాక్టర్ సురేష్, స్వచ్ఛత్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షుడు మోహన్, శ్రీ చిల్డ్రన్స్ సంస్థ అధ్యక్షుడు శ్రావణ్, డైనమిక్ సంస్థ సభ్యులు బాలకృష్ణ, రామసుబ్బయ్య, గోపి, డేవిడ్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామి పురవిహారం



పురవిహారం చేస్తున్న కుమారస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆదివారం రాత్రి పురవిహారం చేశారు. ఆలయంలోని అలంకార మండపంలో శ్రీవళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామిఅమ్మవార్లు పురవిహారం చేశారు. ఈ కార్యక్రమం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



విద్యార్థులకు నూతన దుస్తులు, అందజేస్తున్న మునిశేఖర్

ఏర్పేడు: విద్యతోనే పేదల అభ్యున్నతి సాధ్యమని యువనేస్తం అసోసియేషన్ సంస్థ వ్యవస్థాపకుడు మునిశేఖర్ అన్నారు. మండలంలోని కుమ్మరిగుంట ఎస్టీ కాలనీలో ఆదివారం విద్యార్థులకు నూతన దుస్తులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎస్టీ గ్రామాలు అభివృద్ధి చెందలేదన్నారు. ఎస్టీ గ్రామాల్లో పిల్లలు చదువుకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. బడిఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పుతున్నట్లు వివరించారు. సంస్థ తరపున వివిధ ఎస్టీ కాలనీల్లో వలంటీర్లను ఏర్పాటు చేసి సాయంత్రం విద్యార్థులకు ట్యూషన్ చెబుతున్నట్లు వెల్లడించారు. ఎస్టీ గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ సంస్థ ప్రతినిధులు అరుణ, నాగమణి, హేమలత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అరాచకాలపై నిరసన



పిచ్చాటూరులో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పిచ్చాటూరు: జిల్లాలోని పుంగనూరు, అంగళ్లలో చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా టీడీపీ చేసిన అరాచకాలను ఖండిస్తూ ఆదివారం పిచ్చాటూరులోని వైఎస్సార్ విగ్రహం ఎదుట స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు నిరసన తెలిపారు. పుంగనూరు, అంగళ్లలో శుక్రవారం టీడీపీ కార్యకర్తలు వీధిరౌడీల్లా వ్యవహరిస్తూ పోలీసులపై భౌతిక దాడులకు దిగడం, పోలీస్ వాహనాలను దగ్ధం చేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, సర్పంచ్‌లు కేజీ రోస్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వేలు, వైఎస్సార్ టీయూసీ మండల అధ్యక్షుడు మునిరాజ, సింగిల్‌విండో డైరెక్టర్ పురుషోత్తం రెడ్డి, వైస్ సర్పంచ్ శెల్వపెరుమాళ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గోవిందన్, నాయకులు పాల్గొన్నారు.

అక్కసుతోనే టీడీపీ దాడులు

సత్యవేడు: పుంగనూరు, అంగళ్లలో టీడీపీ దాడులను నిరసిస్తూ సురుటుపల్లి ఆలయ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఏవీఎం బాలాజీ రెడ్డి ఆధ్వర్యంలో దాసుకుప్పంలో ఆదివారం ధర్నా చేపట్టారు. చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకే ఆ పార్టీ శ్రేణులు రౌడీల్లా ప్రవర్తించారని ఆరోపించారు.

పోలీసులపై భౌతిక దాడులకు దిగడం, పోలీస్ వాహనాలను దగ్ధం చేయడం, పెద్దిరెడ్డిపై ఆరోపణలు చేయడం నీతిమాలిన చర్య అన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో ప్రజల్లో మంత్రి పెద్దిరెడ్డి వస్తున్న పేరును ఓర్వలేక, టీడీపీ భూస్థాపితం అవుతుందనే అక్కసుతో దౌర్జన్యాలకు దిగారని మండిపడ్డారు. పోలీసులపై దాడులకు పాల్పడిన వారిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు సాగర్, చంద్రు, గోవిందమ్మ, పార్టీ నాయకులు చిరంజీవి, వినోద్, రఘుపతి, కార్తీక్, రమణయ్య, మురుగేశన్, చిన్నయ్య, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.



దాసుకుప్పంలో ధర్నా చేపట్టిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరోగ్యం క్షీణించి వలంటీర్ మృతి




లోకేష్(ఫైల్)

నారాయణవనం: మండలకేంద్రం నారాయణవనం పంచాయతీలో వలంటీర్‌గా పనిచేస్తున్న లోకేష్(32) శనివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. లోకేష్ కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. పలుచోట్ల చికిత్స కూడా తీసుకున్నాడు. అయితే శనివారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురైన లోకేష్‌ను పుత్తూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి అంబులెన్స్‌లో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. లోకేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వలంటీర్‌గా తన పరిధిలోని 50 కుటుంబాలకు ప్రభుత్వ పథకాలను అందిస్తూ అందరి మన్ననలు పొందిన లోకేష్ మృతి బాధాకరమని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ అన్నారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ఎంపీడీఓ గుణశేఖర్, సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి తదితరులు వలంటీర్ లోకేష్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్, తిరుపతి ఎంపీ గురుమూర్తి, తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్, తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే బ్రిజేంద్రారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కారును ఢీకొన్న లారీ



అస్గర్ మృతదేహం

బుచ్చినాయుడు కండ్రిగ : స్థానిక ఎన్‌టీఆర్ నగర్ వద్ద ఆదివారం కారును లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. వివరాలు.. చెన్నైకు చెందిన ఐదుగురు కారులో శ్రీకాళహస్తికి బయలుదేరారు. మార్గం మధ్యలో శ్రీకాళహస్తి నుంచి లారీ ఢీకొంది. దీంతో కారులోని ఐదుగురూ తీవ్రంగా గాయపడ్డారు. 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ వారిలో అస్గర్(42) అనే వ్యక్తి మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మంజునాథరెడ్డి తెలిపారు.

పొత్తులపై అప్పుడు ఆలోచిస్తాం



విమానాశ్రయంలో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్, తెలంగాణ మంత్రి హరీష్‌రావు

రేణిగుంట: తెలంగాణ రాష్ట్రంలో పొత్తుల గురించి ప్రస్తుతానికి ఆలోచన ఏమీ లేదని ఆల్ ఇండియా మజ్లిస్–ఇ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. పొత్తుల అంశంపై సాధారణ ఎన్నికల తేదీ ఖరారయ్యాక మాత్రమే ఆలోచిస్తామని స్పష్టం చేశారు. తిరుపతిలో జరగనున్న ఓబీసీ జాతీయ సభలో పాల్గొనేందుకు ఆదివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ముస్లిం నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఓవైసీ మీడియాతో మాట్లాడుతూ.. మణిపూర్‌లో 90రోజులుగా అల్లర్లు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని బీజేపీ అధిష్టానం తొలగించాలని డిమాండ్ చేశారు.

మంత్రి హరీష్‌రావుకు స్వాగతం

తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావుకు ఆదివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి ఆయన రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని తిరుమలకు బయల్దేరి వెళ్లారు.

నగ్న వీడియో చిత్రీకరణకు యత్నం

శ్రీకాళహస్తి: యువతి నగ్నవీడియో చిత్రీకరించడానికి యత్నించిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు, బెంగళూరుకు చెందిన యువతి(26) కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం ఆదివారం విచ్చేసింది. తేరువీధిలోని లాడ్జిలో అద్దెకు దిగారు. తొటంబేడు మండలం రౌతుసూరమాలకు చెందిన సురేష్(24) లాడ్జిలో రూమ్‌బాయ్‌గా పనిచేస్తుంటాడు. యువతి స్నానం చేస్తున్న సమయంలో వీడియో తీస్తున్నట్లు అనుమానం రావడంతో కుటుంబ సభ్యులకు తెలిపింది. గది వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న సురేష్‌ను నిలదీశారు. స్థానికులు ఆ యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి ఒకటో పట్టణపోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సెల్‌ఫోన్‌ను పరిశీలించగా అప్పటికే డిలీట్ చేసినట్లు గుర్తించారు. సురేష్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.